క్లుప్తంగా

28న జాబ్‌మేళా

మైదుకూరు: మైదుకూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీ వీరాంజనేయ సర్వీసెస్ వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకూ నిర్వహించే జాబ్‌మేళాలో ఎయిల్ డిక్షన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ వారు యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9030008941, 9030008942, 7207088646 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద ఆర్టీసీ సిబ్బంది

పోరుమామిళ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండులో శివరాత్రి పండుగను పురస్కరించుకుని చలివేంద్రం (కూలర్ అండ్ మినరల్ వాటర్) డిపో మేనేజర్ నిరంజన్, ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణారెడ్డి ప్రారంభించారు. ఎస్టీయూ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు, ఆయన సోదరుడు జి.వి.రమణ(ఎన్ఆర్ఐ) ఈ చలివేంద్రం లక్ష రూపాయలతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, వెంగమాంబ హైస్కూల్ కరస్పాండెంట్ పుల్లపనాయుడు, ఏఐటీయూసీ కార్యదర్శి మస్తాన్, వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ బాలవెంకటరెడ్డి, ఎస్టీయూ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అల్లాడుపల్లెలో బండలాగుడు పోటీలు

చాపాడు: మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ తెలిపారు. ముఖ్య అతిథిగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరుకానున్నారు. పోటీలలో గెలుపొందిన ఎడ్ల ఎజమానులకు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్: పట్టణంలోని సుమిత్రానగర్‌కు చెందిన నాగదాసరి చెన్నరాయుడు, సుజనకుమారిల ఆహ్వానం మేరకు బుధవారం స్థానిక పోరుమామిళ్ళ రోడ్డులోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన రిసెప్షన్ వేడుకల్లో నూతన వధూవరులైన డాక్టర్ సోనీచందన, డాక్టర్ చరణ్‌తేజలను ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరగాయత్రి ఫర్టిలిటి సెంటర్ ప్రారంభం



ఫర్టిలిటి సెంటర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: పట్టణంలోని అభ్యాస్ జూనియర్ కాలేజీ సమీపంలో ఏర్పాటు చేసిన వీరగాయిత్రి ఫర్టిలిటి సెంటర్(టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్)ను ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలిటి సెంటర్ నిర్వాహకులు డాక్టర్ కందుల సుమిత్ర, పురిటి పిల్లలు, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వి.వీరప్రసాద్ రెడ్డి, పట్టణంలోని వైద్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చాపాడు: మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు అనే యువకుడికి తీవ్ర గాయాలమయ్యాయి. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన రాజు చాపాడు మండలం అల్లాడుపల్లెలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు బైక్‌లో వస్తుండగా పల్లవోలు సమీపంలో బైక్ అదుపు తప్పి క్రింద పడ్డాడు. రాజును 108లో ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రంజాన్ కిట్ల వితరణ

కడప కల్చరల్: పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కడప బెల్లమండి వీధిలోని మదరస జేహరలో పేదలకు బుధవారం రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. స్థానిక జమా అతె ఇస్లామి హింద్ పక్షాన సంస్థ ప్రతినిధులు 250మందికి బియ్యంతోపాటు నిత్యావసర సరుకుల కిట్లను పేదలకు అందజేశారు.

హర... హర... మహాదేవ...



ప్రత్యేక అలంకరణలో సైకతలింగం



రామేశ్వరంలో శివపార్వతుల సెట్టింగ్



అమృతేశ్వరాలయంలో శివపార్వతులు



ఖాజీపేట: నాగనాదీశ్వర కొండపై క్యూలో భక్తులు

ఘనంగా శివరాత్రి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు శివాలయాలు బుధవారం శివనామస్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. అభిషేకాలు, అర్చనలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, హోమద్రవ్యాలను పూర్ణాహుతిగా సమర్పించారు. కాలక్షేప మండపంలో గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆశీనులను చేశారు. శుభ ముహూర్తంలో వేద మంత్రాలు పఠిస్తుండగా కన్నుల పండువగా మంగళ వాయిద్యాలతో కల్యాణోత్సవం జరిగింది. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పాల్గొని పూజలు చేశారు. విద్వాన్ సొట్టు సాంబమూర్తి శివరాత్రి విశిష్టత, శివపార్వతుల గొప్పతనాన్ని వివరించారు. గణేష్ కోలాట బృందం ప్రదర్శన, తిరుపతికి చెందిన పూర్ణ భగవతారిణి హరికథ అందరినీ ఆకట్టుకుంది. రాత్రి కొవ్వూరు గ్రాండ్ అధినేత కొవ్వూరు రమేష్‌రెడ్డి సతీమణి జయమ్మ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు పాల్గొన్నారు.

- ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకతలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవికి , శంకరాచార్యుడు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి, చండీ మాతకు కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు.



రాజుపాళెం: వెల్లాలలో భీమలింగేశ్వరస్వామి

- హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా స్వామికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. శివ పార్వతుల కళ్యాణోత్సవం, గ్రామో త్సవ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- అమృతేశ్వరస్వామి ఆలయంలోని మరకత లింగేశ్వరునికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, నవరత్న లింగానికి కాశీ జలాలతో భక్తులు అభిషేకాలు చేశారు. అష్టాదశ శక్తి పీఠాలకు ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. సాయంత్రం శివ పార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించి అన్న ప్రసాదం పంపిణీ చేశారు. లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నామారమేష్‌బాబు, టంగుటూరు మారుతీ ప్రసాద్, కార్యదర్శి నాగ శ్రీనివాసులు, పీఆర్‌ఓ ధారాసంతోష్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే

స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో వాసవీమాత, పార్వతీ పరమేశ్వరులు, సీతారాములు, తదితర దేవతా మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. శివ పార్వతుల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి సాయంత్రం వైభవంగా కళ్యాణోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టిరామ్మోహనరావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



చాపాడు: నందివాహనంపై భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి

శివపార్వతుల కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు రూరల్: మండలంలోని నంగనూరుపల్లె శివాలయంలో బుధవారం శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రాజుపాళెం: మండలంలోని వెల్లాల భీమలింగేశ్వర, పార్వతీదేవి ఆలయాల్లో తెల్లవారు జామునే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వెంగలాయపల్లె-రాజుపాళెం గ్రామాల మధ్య మరువంక వద్ద ఉన్న హనుమత్ రామలింగేశ్వరస్వామి ఆలయం, సోమాపురంలో శ్రీచక్రం ఉన్న శివాలయం తదితర ఆలయాలకు భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.



నంగనూరుపల్లెలో జరిగిన కళ్యాణోత్సవంలో బంగారు మునిరెడ్డి

నంది వాహనంపై భద్రకాళి సమేత వీరభద్రస్వామి

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నిర్వహిస్తోన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 5గంటల నుంచి 10గంటల వరకూ, అనంతరం సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి నంది వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 7గంటలకు భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవ వేడుక వైభవంగా నిర్వహించారు. అనంతరం భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి గ్రామోత్సం నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు: మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం భక్తులతో పోటెత్తింది. బుధవారం తెల్లవారుజామున వీరభద్రస్వామి, భద్రకాళీమాత, కేథారీశ్వరుడులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ అనంతరం పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చాపాడు మండలంతో పాటు జిల్లాలోని నలుమూలల నుంచి వేలాది భక్తులు గంటల తరబడి క్యూ లైన్లో నిల్చొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. మహా శివరాత్రి ఉత్సవాల పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. గట్టి పోలీసు బందోబస్తు పెట్టారు.

బి.మఠం మండలంలో ఘనంగా శివరాత్రి వేడుకలు

బ్రహ్మంగారిమఠం: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని పలు శివాలయాలలో ప్రత్యేకంగా దర్శనం ఏర్పాట్లు చేయడంతో భక్తులు శివ పార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. లింగాలదిన్నెపల్లె దగ్గర వెలసిన దూదెమ్మ కోనలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు నిర్వాకుడు భూమిరెడ్డి కృష్ణారెడ్డి భజనలు. అన్నదానాలు, నాటికలు ఏర్పాటు చేశారు.

ఈశ్వరీదేవి మఠంలో శివపార్వతుల కల్యాణం

ఈశ్వరీదేవిమఠంలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణం ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉభయ దాతలు సుంకు సురేష్ దంపతులు నిర్వహించారు. ముందుగా శివ పార్వతుల విగ్రహాలకు తులాభారం నిర్వహించారు. మఠాధిపతి వీరకుమారస్వామి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

భక్తులతో నాగనాదీశ్వర కొండ కిటకిట

ఖాజీపేట: మహాశివరాత్రిని పురస్కరించుకుని నాగనాదీశ్వర కొండ భక్తులతో కిటకిటలాడింది. పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి వచ్చి స్వామి వారికి అభిషేకాలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు క్యూ నిర్వహించారు. కొండ దిగువన వచ్చిన భక్తులకు ఆర్య వైశ్య కమిటీ అధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



కాశీవిశ్వేశ్వరస్వా ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్ఫటిక శివలింగం



గోపవరం : భక్తులతో పోటెత్తిన మల్లెంకొండ



బి.కోడూరు: ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న 108 శివలింగాలు



బి.కోడూరు: శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్: లంకమల అభయారణ్యంలో వెలసిన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం (లంకమల క్షేత్రం)కు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దాతలు అన్నదానం ఏర్పాటుచేశారు. పట్టణంలోని పురాతన శివాలయం రూపరాంపేట శివానందస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు మడకలవారిపల్లెలో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి స్ఫటిక శివాలయం, నాగులచెరువు కట్ట వద్ద ఉన్న శివాలయం, తెలుగుగంగ కాలనీ సమీపంలోని పార్వతి సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయం, అనంతగిరి క్షేత్రంలోని మృత్యుంజయాలయం, చెన్నంపల్లె శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

మల్లెంకొండకు పోటెత్తిన భక్తులు

గోపవరం: మల్లెంకొండ భక్తులతో పోటెత్తింది. మంగళవారం నుంచే కాలినడకన భక్తులు మల్లెంకొండకు చేరుకున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు కడప జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుండి భక్తులు రావడం జరిగింది. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయ అధికారులు, పాలక మండలి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొండపైన వచ్చిన భక్తులకు తాగు నీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని రాచాయపేటలోని సోమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

కాశినాయనలో..

కాశినాయన: కత్తెరగండ్ల శివాలయం, అక్కంపేట విభూది నాగలింగేశ్వర శివాలయం, గంగనపల్లె, కనికెలగుండం, నీలకంఠేశ్వర ఆలయం, వరికుంట్ల శివాలయాల్లో వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. జ్యోతిక్షేత్రం భక్తులతో పోటెత్తింది. అన్ని శివాలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నల్లమల్ల కొండల్లోని బెలూమ్ గుహలో వెలసిన శివలింగాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అక్కడ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కలసపాడులో..

కలసపాడు: స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, మహానందిపల్లెలోని వీరాంజనేయస్వామి ఆలయంలో పురోహితులు వారణాసి వెంకటరమణవరప్రసాద్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అన్ని శివాలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల: పట్టణంలోని శివాలయం శ్రీ బాలాత్రిపుర సందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మధుస్వామి, ధర్మకర్త సత్యనారాయణరెడ్డి ఎమ్మెల్సీ దంపతులను సత్కరించారు. వారి వెంట సర్పంచ్‌చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, యువనేత గిరిప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ సిద్దేశ్వరస్వామిని శివరాత్రి సందర్భంగా బుధవారం పీఆర్ ఆర్‌డి రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి దంపతులు సందర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారిని ఆలయ మర్యాదలతో ఆహ్వానించి సత్కరించారు.

బి.కోడూరులో.

బి.కోడూరు: మండలంలోని మేకవారిపల్లెలోని శ్రీఅఖిలాండేశ్వరి బ్రహ్మానంద ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణం వేదపండితులు నిర్వహించారు. ఆశ్రమంలోని 108 శివలింగాలు, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, నిలువెత్తు 25 అడుగుల శివలింగం, సహస్ర శివలింగం భక్తులను ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు పలు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే గంగిరెడ్డిపల్లె సగిలేరు ఒడ్డున వెలసి ఉన్న శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, ఐత్రంపేట శివాలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.నరసింహ్మాపురం గ్రామ సమీపంలో గల పురాతన దపిశేశ్వరిదేవి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.





బద్వేలు : రూపరాంపేట శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కాశినాయన : కత్తెరగండ్ల శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



ఎమ్మెల్సీ దంపతులకు తీర్థప్రసాదాలు అందచేస్తున్న అర్చకులు



అభిషేకం చేయిస్తున్న నాగార్జునరెడ్డి దంపతులు

పేదలకు అన్యాయం చేస్తే చరిత్ర హీనులవుతారు

బద్వేలు అర్బన్: పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించి వారికి అన్యాయం చేయాలని చూస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, పి.సుబ్బరాయుడులు తెలిపారు. సి.కొత్తపల్లె, చెన్నంపల్లె గ్రామపొలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరు చేయాలని గత ఆరు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురైతే పట్టించుకోని రెవెన్యూ అధికారులు ఇళ్ళు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆలోచించి పేదలకు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్త ఆందోళనలకు సిద్దమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, పట్టణ, రూరల్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బరాయుడు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి

సీఎం చంద్రబాబుకు కాంగ్రెస్ పార్టీ బహిరంగ లేఖ

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం–2024ను వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేయబోమని ఓ తీర్మానాన్ని ఆమోదించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కాంగ్రెస్ పార్టీ బహిరంగ లేఖ రాసింది. కడప ఐటీఐ సర్కిల్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ కమిటీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ లేఖను బుధవారం గాంధీకి సమర్పించి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ పాత వక్ఫ్ రక్షణ చట్టం–1995ను మాత్రమే రాష్ట్రంలో అమలు చేస్తామని, మరో అనుబంధ తీర్మానాన్ని ఆమోదించాలని బహిరంగ లేఖలో కోరారు. రాష్ట్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థల నుంచి మైనార్టీలను రక్షిస్తామని చంద్రబాబు శాసన సభలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొత్త వక్ఫ్ చట్టం అమలుకు కేంద్రం ఒత్తిడి తెస్తే.. వెంటనే మద్దతు ఉపసంహరించాలని చంద్రబాబును కోరారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని బహిరంగ లేఖలో హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీరును చంద్రబాబు ప్రభుత్వం వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మయానా రహంతుల్లా ఖాన్, ఎస్.హమీద్, దినకర్‌రెడ్డి, కమల్‌బాషా, జహూర్, రహంతుల్లా, మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. కడపలోని తమ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. వెంటనే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.